ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు

## పరిశుభ్రతతో ఆరోగ్యం

**ప్రజాశక్తి-దుంబ్రిగూడ:** నివాస, గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక కోర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొమ్ములు చెప్పారు. ఆ పంచాయతీ జాంగుడలో సచివాలయ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నివాస గృహాల వద్ద చెత్తాచెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపయోగించిన చెత్తా చెదారాన్ని దూరంగా తీసుకెళ్లి పడేయాలని చెప్పారు. రోజువారీగా పిల్లలను బడికి పంపే విధంగా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. బాగా చదివితే భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పి.కోగేస్, ఆశ కార్యకర్త, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

పెదబయలు తహశీల్దార్ ఆత్మహత్యపై ...

# సమగ్ర విచారణ చేపట్టాలి

▶▶ పిఒపై వస్తున్న ఆరోపణపై దర్యాప్తు చేయాలి ▶▶ గిరిజన సంఘాల నేతల డిమాండ్

**ప్రజాశక్తి-పాడేరు:** పాడేరు ఐటిడిఎ పిఒ దుర్భాషలాడటంతో మనస్తాపం చెంది పెదబయలు మండల తహశీల్దార్ శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ నిర్వహించాలని, వాస్తవాలను నిర్ధారించి బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య నేతలు డిమాండ్ చేశారు. పెదబయలు మండల తహశీల్దార్ అత్మహత్యపై గిరిజన సంఘం, గిరిజన సమాఖ్య సంయుక్తంగా పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాక్రిష్ణ మాట్లాడుతూ, సామాజికంగా, వ్యక్తిగతంగా ఎదురయ్యే రుగ్మతలను సమర్ధవంతంగా ఎదుర్కొ వాలని, ఆత్మహత్య పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఇటీవల పాడేరులో పిఒ నిర్వహించిన సమీక్ష సమావేశంలో జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే నిర్వహణ నివేదికలో పురోగతిలేదని పెదబయలు తహశీల్దార్‌ను దుర్భాషలాడిన్నట్లు రెవిన్యూ సిబ్బంది నుండి విమర్శలు వస్తున్నాయని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతంలో కుటుంబాలను కాదనుకొని విధులు నిర్వహిస్తున్న అధికారులకు మనోధైర్యం కల్పించి సమర్థవంతంగా విధులు నిర్వహణకు తోడ్పాటు ఇవ్వాల్సిన ఉన్నతాధికారులు భయబ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

రెవిన్యూ శాఖతో పాటు వివిధ శాఖల ఉద్యోగస్తులపై పిఒ రోణంకి గోపాలకృష్ణ వేధింపులకు గురి చేస్తున్నట్లు పలువురు చెపుతున్నారన్నారు. పెదబయలు తహశీల్దార్ మృతిపై సమగ్ర విచారణ నిర్వహించి ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన తహశీల్దార్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ మృతి పట్ల సంతాపం తెలిపారు.

**పెదబయలు:** పెదబయలు తహసిల్దార్ ఓ. శ్రీనివాసరావు ఆత్మహత్యపై విచారణ చేయాలని గిరిజన సంఘం నాయకులు కొమ్మ పృథ్వీరాజు, బోండా సన్నిబాబు, కిలో సర్బన్న డిమాండ్ చేశారు. తహశీల్దార్ ఆత్మహత్యపై సంబంధిత రెవెన్యూ అధికారులను నాయకులు అడిగి తెలుసుకున్నారు. పాడేరులో జరిగిన రెవెన్యూ అధికారుల రివ్యూ మీటింగ్‌లో పిఒ స్థానిక తహశీల్దార్‌ను గట్టిగా మందలించడంతో మానసిక శోభకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ విషయాలపై సమగ్రంగా విచారించి దోషులు ఎవరైనా చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు చెండ రామారావు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతన్న చిరు వ్యాపారులు

## చిరు వ్యాపారుల ఆందోళన

**ప్రజాశక్తి-దుంబ్రిగూడ:** యధావిధిగా చాపరాయిని తెరిచి గిరిజన చిరు వ్యాపారస్తులకు జీవనోపాధి కల్పించాలని, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పి శాంతకుమారి డిమాండ్ చేశారు. జలపాతంలో వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు గురువారం చాపరాయి జలపాతం గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చాపరాయి వద్ద సుమారు 120 కుటుంబాలు చిరు వ్యాపారం చేసుకుంటూ బతుకుతున్నారన్నారు. చాపరాయి టెండర్ యజమాని సుమారు రూ32 లక్షలు ప్రభుత్వానికి చెల్లించారన్నారు. చాపరాయి తెరవకపోవడంతో టెండర్ యజమాని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే స్పందించి చాపరాయిని తెరిచి అందుబాటులోకి తీసుకొచ్చి కార్మికులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బాకా సులోచన, చిరు వ్యాపారస్తుల సంఘం ప్రతినిధులు కీల్లో నలమ్మ, కే.సుమన్, ఎస్కె సీతమ్మ, కుమారి చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై..

## ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టాలని ధర్నా

**ప్రజాశక్తి -రంపచోడవరం**

మండలంలోని కాకవాడ గిరిజన సంక్షమ ఆశ్రమ బాలికల పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్ఎం భర్త ప్రసాద్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక ఐ.టి.డి.ఎ కార్యాలయం వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యాన గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కాకవాడ పాఠశాలలో హెచ్ఎం భర్త తానే హెచ్ఎంగా వ్యవహరించటం, పాఠశాల లో లైంగిక వేధింపులకు పాల్పడటం, అమానుషంగా విద్యార్థులపై ప్రవర్తించడం, మెనూ సక్రమంగా అమలు చేయక పోవడం దారుణమన్నారు. గిరిజన సంఘాలను అనుమతించక పోవడం వల్ల ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. నిందితులను కఠినంగా శిక్షించక పోతే ఇలాంటి దారుణాలు మరిన్ని పునరావృతం అవుతాయని పేర్కొన్నారు. తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ.సిరిమల్లి రెడ్డి, నాయకులు ఎ.ధర్మారెడ్డి, అమ్మిరాజు, రమాదేవి, శ్రీదేవి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె. శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న నాయకులు, సర్పంచ్

## కార్యదర్శికి సత్కారం

**ప్రజాశక్తి-అనంతగిరి:** మండలంలోని టోకురు పంచాయతీలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన కార్యదర్శి దండ్యాల లక్ష్మిని ఘనంగా సత్కరించారు. టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య ఆధ్వర్యంలో గురువారం సచివాలయ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొస్య మాట్లాడుతూ, పంచాయతీలో అందుబాటులో ఉండి సేవలందిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందే విధంగా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.నరసన్న, మాజీ సర్పంచులు సారా దొన్ను, సారా. సోము, వార్డు మెంబర్లు పి.లక్ష్మణరావు, వీఆర్వో రామన్న, టిడిపి నాయకులు దొన్ను, చందరరావు, సిపిఎం నాయకులు జి.దేవన్న పాల్గొన్నారు.

# ఆధార్ అప్డేట్ ప్రక్రియను వేగవంతం చేయండి

▶▶ డిజిటల్ అసిస్టెంట్‌కు రోజుకు 30 లక్ష్యం ▶▶ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**ప్రజాశక్తి-పాడేరు:** ప్రతి డిజిటల్ సహాయకులు రోజుకి కనీసం 30 ఆధార్ కార్డుల అప్డేషన్లు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 73 ఆదార్ నమోదు కేంద్రాలున్నాయని, సచివాలయ సిబ్బంది ఒక సంవత్సరం లోపు పిల్లల వివరాలు తీసుకుని వారికి ఆధార్ చేయించాలన్నారు. ముఖ్యంగా 2010-2016 మధ్య ఆధార్ చేయించుకున్న వారికి తప్పనిసరిగా మ్యాండేటరీ బయోమెట్రిక్ చేయాలని ఆదేశించారు. కొత్త ఆధార్ నమోదులు, డెమోగ్రఫి మార్పులు చిరునామా మార్పులు చేయాలన్నారు. అవసరమైన డాక్యుమెంట్లు లేకుంటే యుఐడి నిర్దేశించిన ఫారం లో గెజిటెడ్ అధికారి అటస్టేషన్ చేస్తే సరిపోతుందన్నారు. ప్రస్తుతం యుఐడి సాఫ్ట్వేర్‌తో సింగల్ ప్రింట్ డివైస్ ఆప్షన్ ఉపయోగించి కొత్తగా ఆధార్ పొందవచ్చన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు సర్వీస్ ప్రొవైడర్లుగా సేవలు అందించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేసారు. ఆధార్ లేకుంటే లబ్దిదారులు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున సేవా భావంతో పని చేయాలని సూచించారు. అవసరమైతే మారుమూల గ్రామాలలో ప్రత్యేక శిభిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ పరిధితో సంబంధం లేకుండా ఎవరికైనా ఆధార్ చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేసారు. ఆధార్ తీసుకుని పది సంవత్సరాలు దాటిన వారిని గుర్తించి అప్డేట్ చేయాలని, రానున్న ఎన్నికలలో ఆధార్ ఆధారిత ఎపిక్ కార్డులకు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. ఆధార్ నమోదులు, అప్డేషన్, బయో మెట్రిక్, బయో మెట్రిక్, డెమోగ్రఫి అప్డేషన్లు చేయటంలో సంబంధిత ఎంపిడిఓలు భాధ్యత వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ అధికారి రాంగోపాల్, జిల్లాలోని డిజిటల్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## ముమ్మరంగా గాలింపు చర్యలు

**ప్రజాశక్తి-సీలేరు**

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒకపక్క మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు, మరోపక్క ఎదురు కాల్పులతో స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యాన సాయుధ పోలీసు బలగాలును మొహరించి అణువణువునా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన కూడళ్లలో సిఆర్పిఎఫ్ పోలీసు బలగాలను మోహరించి జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచిపెట్టారు. మావోయిస్టుల కదిరిగులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక జల విద్యుత్ కేంద్రం, రిజర్వాయర్లకు మావోయిస్టు నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పగడ్బందీ చర్యలు చేపట్టారు. ఎదురు కాల్పుల నేపథ్యంలో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ కంటిమీద కునుకు లేకుండా తీవ్రభయంతో గుర్తై కాలం వెలదీస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న పుల్లయ్య

## పనుల్లో నాణ్యత పాటించాలి

- జెజెఎం జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** జల జీవన్ మిషన్(జెజెఎం) ప్రాజెక్టు పనులను 2024 నాటికి పూర్తి చేసే లక్ష్యంతో అందరు పని చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని జెజెఎం జిల్లా కో-ఆర్డినేటర్ పుల్లయ్య సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండలంలోని గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శిలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జెజెఎం(జల జీవన్ మిషన్)ప్రాజెక్టు పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ, జెజెఎం ప్రాజెక్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటింటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొళాయిలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. ముంచంగిపుట్టు మండలం లో 258 గ్రామాలకు రూ.29కోట్లు45లక్షల నిధులు మంజూరైందన్నారు. గ్రామాల్లో గ్రావిటీలు ఉన్న గ్రామాలను సర్వే చేసి గుర్తించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. గ్రామాల్లో పనులను నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్, కార్యదర్శిలతో కూడిన 15 మందితో కమిటీని నియమించుకుని ఆ సభ్యుల ద్వారా జెజెం పనులు చేపట్టాలన్నారు. త్వరితగతిన జెజెం ప్రాజెక్టు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కిరణ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈఈ గోపాల్ కృష్ణ, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శిలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:** లింగ వివక్షత, ఆడపిల్లలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎదుర్కోవడంపై స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల 1లో ఐసిడిఎస్ సిడిపిఓఎస్ రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రాజేశ్వరి మాట్లాడుతూ, బలవంతపు వివాహాలు, గృహ హింసలను వ్యతిరేకించాలన్నారు. చదువుతోపాటు సమాజంలో ఆడపిల్లల పట్ల జరుగుతున్న అత్యాచారాలను తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

# సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

**ప్రజాశక్తి - రంపచోడవరం**

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పోరాటాలకు సిద్ధం కావాలని, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ సమావేశ మందిరంలో గురువారం ఆశావర్కర్ల యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రథమ యూనియన్ నాయకులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికుల హక్కులు చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని, కార్మికులు సమస్యలపై ఆందోళ చేస్తున్న కార్మికులు, నాయకులపై అక్రమ కేసులు బనాయించడంతోపాటు నిర్బంధాలకు గురి చేస్తున్నారన్నారు. కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తూ కార్మికులు పోరాటాలు ద్వారా సాధించుకున్న హక్కులను కాలరాస్తు శ్రమదోపిడీ చేస్తున్నారని తెలిపారు. జిల్లాల విభజన సరిగా జరగకపోవడంతో ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. చనిపోయిన ఆశావర్కర్లు కు నష్టపరిహారం రూ.10లక్షలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, లేకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొప్పెన కిరణ్ మాట్లాడారు.

**నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ రంపచోడరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బీరబోయిన దారేశ్వరి, మట్ల వాణిశ్రీ, కోశాధికారిగా కళింకోట రమణమ్మ, గౌరవ అధ్యక్షులుగా పల్లపు వెంకట్, ఉపాధ్యక్షులుగా సవీర్ల వెంకటలక్ష్మి, కుంజం రాధమ్మ, పల్లాల లింగమ్మ, కుంజం వీరలక్ష్మి, ముత్తమ్మ, సహాయ కార్యదర్శులుగా కె.జయలక్ష్మి, సారపు వెంకటలక్ష్మి, కొపురి చంద్రవతి, ముత్యాలమ్మ, కొమరం, చెల్లయమ్మ, మరో 12మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పూనెం సత్యనారాయణ, కంభం శాంతిరాజు, పుట్ట రామరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికైన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గం

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వీర కిషోర్

## పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కీలకపాత్ర వహించాలని మారేడుమిల్లి జడ్పిటిసి గొర్లె బాలాజీబాబు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీర కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో జడ్పిటిసి బాలాజీ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పంచాయతీల అభివద్ధికి తీసుకోవాల్సిన కీలక అంశాలను వివరించారు. పంచాయతీల్లో తాగునీరు, చేతిబోర్లు, వీధిలైట్లు, రహదారులు అంశాలను సర్పంచులతో చర్చించారు. పంచాయతీల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి, కుండాడ, గుజ్జుమామిడివలస, చావడకోట దొరచింతలపాలెం, డి వెలమలకోట, తాడేపల్లి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

స్థానిక 99 క్వార్టర్ రహదారిలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న 400 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎంపీడీవో కె బాపన్న దొర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్డును పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

సిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ బాపన్న దొర

# ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదు

గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్

**ప్రజాశక్తి-ఎటపాక**

గిరిజనులకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకు ఉద్యమం ఆగదని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు. ఎటపాకలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఇళ్ల స్థలాల పోరాటంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 8 రోజులుగా 150 మంది ఆదివాసి ప్రజానీకం ఇంటి స్థలాలు ఇవ్వాలని ఉద్యమం చేస్తుంటే ప్రభుత్వానికి కళ్ళు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అధికారం కోసం అనేక వాగ్దానాలు చేస్తున్న ఈ పాలకులు ఆదివాసీలకు ఐదు సెంట్లు భూమి ఇవ్వడానికి ఎందుకు చేత కావడంలేదన్నారు. ఇప్పటికైనా గిరిజన బిడ్డలపై కాస్తాయినా ప్రేమ ఉంటే వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు కాకా అర్జున్ దొర, అజయ్ కుమార్, కారం నగేష్, నక్క సూరిబాబు, బుద్ధుల భద్రయ్య, సవలం రాము తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచేస్తున్నగిరిజనులు, మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్

## కాస్మోటిక్స్ సరఫరా చేయాలి

మాట్లాడుతున్న గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

1ప్రజాశక్తి-పాడేరు టౌన్: గత ప్రభుత్వం విద్యార్థులకు నెలకు సరిపడా కాస్మొటిక్స్ సరఫరా చేసిన విధంగానే ఇవ్వాలని జిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని జిఎస్‌యు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వసతి గృహాల విద్యార్థుల సంక్షేమం కొరవడిందని, వీరికి అందాల్సిన సౌకర్యాలకు ప్రభుత్వం గండి కొడుతుందని ఆరోపించారు. గిరిజనుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అమలులో విఫలమవుతోందన్నారు. వసతి గృహాల విద్యార్థులకు కాస్మొటిక్స్ పంపిణీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. టూత్ పేస్ట్, సబ్బులు, కొబ్బరినూనె, షాంపూలు, డిటర్జెంట్ సబ్బులు, టూత్ బ్రష్ వంటి తదితర సామాగ్రి విద్యార్థులు ఇంటికి వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేయాల్సిన సామాగ్రి నిలిపివేసి తల్లుల ఖాతాలో అమ్మఒడి పేరుతో నగదు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన విద్యార్థులకు ప్రతినెల కాస్మొటిక్స్ సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, సూరిబాబు, ఉదయ్ కిరణ్, రామకృష్ణ, దేవదాసు, ప్రసాద్, డానియల్, ఏసుదాసు పాల్గొన్నారు.

## నేడు నిరసన ర్యాలీ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 9న శుక్రవారం గిరిజన విద్యార్థుల మరణాలపై నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభుదాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. ఈ నిరసన ర్యాలీలో గిరిజన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీలో ఇటీవల కాలంలో ఐదుగురు విద్యార్థులు మృత్యువాతకు గురయ్యారని, సంబంధిత అధికారులు పట్టించు కోలేదన్నారు.ఈ మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, గిరిజన విద్యా సంస్థలలో ఎక్కడ కూడా పూర్తిస్థాయి మెనూ అమలు కాక పోవడంతోనే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నారావు, నరేష్, మచ్చ రాజు పాల్గొన్నారు.

## అరకులో స్కిల్ కాలేజీ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ప్రతి పార్లమెంట్ నియోజకర్గ స్థాయిలో ఒక స్కిల్ కాలేజ్ ప్రారంభం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్ సహకారంతో జిల్లాలోని అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అరకు వ్యాలీలో స్కిల్ కాలేజ్ యువజన శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ స్కిల్ కాలేజ్‌లో హౌస్ కీపింగ్ మేనేజర్, ఫుడ్ ఔట్లెట్ మేనేజర్ కోర్స్ లలో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కోర్స్‌ల్లో చేరడానికి ఏదైన డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. ఈ స్కిల్ కాలేజ్ లో ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, బోజన సదుపాయం కల్పించనున్నారన్నారు. శిక్షణ కాలం 5 నెలల నుండి 6 నెలలు వుంటుందని, అనంతరం సర్టిఫికేట్ జారీ చేయటంతో పాటు ఉపాధి కల్పిస్తారని కలెక్టర్ వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్:9014767230, 9398338105 నెంబర్లని సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థులు ఇష్టపడే మెనూ అమలు చేయాలి

ప్రజాశక్తి-పద్మనాభం : ప్రభుత్వపాఠశాలల్లోని విద్యార్థులు ఇష్టపడి తినే పదార్థాలతో మెనూ అమలు చేయాలని, ప్రస్తుతం సవరించిన మెనూ ప్రకారం పెట్టిన భోజన పదార్థాలను విద్యార్థులు అయిష్టంగా తింటున్నారని మధ్యాహ్న భోజన కార్మికుల అసోసియేషన్ (సిఐటియు) అధ్యక్ష కార్యదర్శు అప్పలనర్సమ్మ, కె.రమణమ్మ డిమాండ్ చేశారు. గురువారం పద్మనాభం మండల కాంపెక్స్‌లో మధ్యాహ్న భోజన కార్మికు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం అమలులో ఉన్న మెనూ మార్చడంతోపాటు మెనూ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. సాంబార్ బాత్, ఆకుకూర అన్నం, సోమవారం పులావ్ తినేందుకు పిల్లలు ఇష్టపడడం లేదని, గతంలో వలె సాంబారు, గుడ్లుపులుసు, కాయగూరలు, బఠాణీకూర.వంటి కూరలతో పేడితే విద్యార్థులు సంతృప్తిగా భోజనం చేస్తారన్నారు.పాఠశాలల విలీనం పేరుతో మధ్యాహ్నభోజన నిర్వాహకులను తొలగించడం దుర్మార్గమన్నారు. సమస్య పరిష్కారానికి భోజన నిర్వాహకులంతా సంఘటితంగా పోరాటానికి సన్నద్ధం కావాలని నిర్ణయించారు.

## జాబ్ కార్డుదారులకు ఉపాధి పనులు కల్పించాలి

### ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న పిఒ,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. ఐటిడిఎ కార్యాలయం నుండి 11 మండలాల ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధి హామీ అధికారులు, ఎటిడబ్ల్యూ ఒలు, ఎంఇఒలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు, మిషన్ కనెక్ట్ పాడేరు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, మనబడి నాడు నేడు పనులు, జల జీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్ వేగంగా చేయాలని సూచించారు. గృహ నిర్మాణాలు చేస్తున్న స్థలాలకు లబ్ధిదారులతో ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేసారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గృహ నిర్మాణాలకు రూ.35 వేల రుణాలను మంజూరు చేయాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు నిర్దిష్టమైన సమయానికి పూర్తి చేయాలని చెప్పారు. తాగు నీటి సమస్యలు తలెత్తకుండా జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయడానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జాజుల పాలెం, అంజలి శనివారం, గుల్లేలు - ఖంద్రూం, చింతపల్లి సీలేరు రోడ్డు పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుత్తుల పుట్టు రోడ్డుకు రూ35 లక్షలు మంజూరు చేసామని యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపించాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఇఒ పి.రమేష్, టిడబ్ల్యూ ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, ఆర్అండ్ బి ఇఇ బాలసుందర బాబు, పిఆర్ ఇఇ టి.కొండయ్యపడాల్, హౌసింగ్ పిడి బిహెచ్ శ్రీనివాస్, ఇఇ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ లీలాకృష్ణ, డిఇ ప్రకాష్, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని, ఎంఇఒ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ, ఉద్యాన పథకాలను వినియోగించుకోవాలి

### జిల్లా ఉద్యానవన శాఖాధికారి రమేష్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో గిరిజనులు వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా ఆర్‌కెవివైలో భాగంగా పంట విస్తరణ పథకం కింద రూ.8.60 లక్షలతో 756 హెక్టార్లలో గిరిజన రైతులకు మామిడి, జీడీ మామిడి, అల్లం, ఆయిల్ పామ్‌లో కోకో మొదలైన పంటలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 100 హెక్టార్లలో కూరగాయల పంటలు సాగుకు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.ఎంఐడి హచ్ పథకం కింద జామ, మామిడి, జీడిమామిడి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెర్రీ, అవకాడో తోటలకు రూ.59.67 లక్షలతో 311 హెక్టర్లు అభివృద్ధికి రైతులను గుర్తించడం జరిగిందన్నారు. రూ.22.40 లక్షలతో 224 హెక్టార్లలో జీడి మామిడి తోటల పునరుద్ధరణకు రైతులను గుర్తించామన్నారు. రక్షిత సాగు పద్ధతిలో రూ. 51.53 లక్షల వ్యయంతో 26 షేడ్ నెట్ల నిర్మాణ మునకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకం కింద రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పలువురు రైతులకు ఉపయోగపడే విధంగా జిల్లాలో 75శాతం రాయితీతో రూ.15 లక్షలతో 22 గోదాములు, రెండు కోల్డ్ స్టోరేజ్ ల నిర్మాణాలను చేపట్టామన్నారు. ప్రధాన మంత్రి - సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల పథకం కింద 30 చిన్న తరహా పరిశ్రమలకు రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, ఉద్యాన శాఖ - సూక్ష్మ నీటి పారుదల శాఖ ద్వారా ఉద్యాన పంటలకు బిందు సేద్యం తకింద డ్రిప్, స్ప్రింక్లర్స్ ఏర్పాటుకు రైతులను గుర్తించామని తెలిపారు. ఐటీడీఏ- కాఫీ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు 15వేల కాఫీ మొక్కలను, 15 లక్షల మిరియాల మొక్కలను అందించడం జరిగిందని, వ్యవసాయ శాఖ ద్వారా 430 టన్నుల రాజ్మా విత్తనాలను గిరిజన రైతులకు సరఫరా చేసామని వివరించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ప్రతి మంగళవారం 'తోటబడి' కార్యక్రమము ద్వారా వివిధ పంటల పై సస్య రక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

## హరిత సాంకేతిక పరిజ్ఞానంతో కాలుష్య నియంత్రణ

### గీతం జాతీయ సదస్సులో విసి దయానంద సిద్దవట్టం

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గీతం వీసీ, తదితరులు1

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచలోని కాలుష్య తీవ్రతను తగ్గించాలంటే హరిత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయడమొక్కటే ప్రత్యామ్నాయ మార్గమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అన్నారు. సుస్థిర అభివృద్ధికి హరిత సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, పర్యావరణ శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న రెండురోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ఇజ్రాయల్, బ్రెజిల్ తదితర దేశాలలో జీవ ఇంధనం వాడుతుండగా, భారత్‌లో వ్యవసాయ వ్యర్థాలను అనవసరంగా తగలబెట్టి, ఢిల్లీ పరిసరాలలో కాలుష్యాన్ని పెంచుతున్నామన్నారు. సైన్స్, ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ తదితర విభాగాల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన తో ప్రజలకు అందుబాటు ధరలో లభించేలా హరిత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయవచ్చు నన్నారు. మితిమీరిన సహజ వనరుల వినియోగంతో జంతువుల నుంచి మానవాళికి వైరస్‌లు సంక్రమిస్తున్నా యన్నారు. ఒడిశాలోని సంబల్పూర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సంజత్ కుమార్ సాహూ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇంకా పాత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం కాలుష్య తీవ్రతకు కారణమౌతోందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి. గీతం పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ వి.సరిత, సదస్సు కన్వీనర్ డాక్టర్ కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

## వ్యాన్, బైక్ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బంగారు మెట్ట పంచాయతీ కుజబంగి కూడలి వద్ద గురువారం ఉదయం వ్యాన్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారు పెదబయలు మండలం జామిగూడ పంచాయతీ గుంజివాడ గ్రామానికి చెందిన జర్సింగి భాస్కరరావు(26), జర్సింగి చంద్రమౌళి (30). వీరు వ్యక్తిగత పనుల నిమిత్తం గుంజివాడ నుండి కుజబంగి మీదుగా పెదబయలు వెళ్లేందుకు గురువారం ఉదయం బైక్‌పై బయలు దేరారు. ఈ క్రమంలో కుజబంగి జంక్షన్ కూడలి వద్దకు వచ్చే సరికి కొత్తవలస నుండి ముంచిగిపుట్టు వస్తున్న వ్యాన్ ఒక్కసారిగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో బైక్ నుజ్జు నుజ్జు అయ్యింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు కావ్వడంతో కొంతమంది సహాయంతో ముంచింగిపుట్టు సిహెచ్‌సికి తరలించారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## లోగిలిలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: 1మండలంలోని గసభ పంచాయితీ లోగిలి గ్రామంలో స్థానిక టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గురువారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ, టిడిపి ప్రభుత్వంతోనే గిరిజన ప్రాంత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కే.సుబ్బారావు, అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

## డస్ట్ బిన్లు ఏర్పాటు

డస్ట్‌బిన్లతో వ్యాపారులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో పారిశుధ్య నిర్మూలనకు అక్కడ వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు తమ సొంతంగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకున్నారు. పారిశుధ్యం ఎక్కువగా ఉండటంతో ఇటీవల సందర్శించిన జిల్లా కలెక్టర్ పరిశుద్ధ నిర్మూలనకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా చాపరాయి జలపాతంలో పర్యాటకులు వెళ్లకుండా కొద్ది రోజులు నిషేధించి, చెత్తా చెదారాన్ని పూర్తిగా అధికారులతో తొలగించారు. మళ్లీ ఆ పరిస్థితి ఏర్పడకుండా చిరు వ్యాపారులు సొంతంగా డస్ట్ బిన్లు గురువారం ఏర్పాటు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకున్నట్లు చిరు వ్యాపారులు సుమన్, సులోచన తెలిపారు.

## సెలవుల అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రజాశక్తి- సిరిపురం : అన్ని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కాలేజీలు ప్రతి నెలా రెండో శనివారం, అన్ని ఆదివారాలోల విధిగా సెలవు పాటించాల్సిందేనని ఎపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం స్పష్టం చేశారు. గురువారం విశాఖ నగరం పిఠాపురం కాలనీలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో ఆర్ఐఒ .ఆర్.సత్యనారాయణతో కలసి నిర్వహించిన సమావేశంలో సీతారాం మాట్లాడుతూ ప్రభుత్వంనిర్ధేశించిన సెలవులు అమలులో ఏవైనా కాలేజీ యాజమాన్యాలను నిర్లక్ష్యం చేస్తే వాటి గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్ఒఐ ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించిన కళాశాలల అనుమతులు రద్దు చేస్తామన్నారు.

ఉపాధి పనులకు వచ్చిన కూలీలు

## ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

దేవీపట్నం మండలం, దేవారం గ్రామపంచాయతీ పరిధిలో పొట్టి చెరువులో ఉపాధి హామీ పనులను దేవారం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన దేవీపట్నం మండలం, చిన్న రమణయ్య పేట పంచాయతీ కొయ్యల వీరవరం గ్రామస్తులకు ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. ఉపాధి కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తెల్లం కామన్న దొర, ఫీల్డ్ అసిస్టెంట్లు కారం లక్ష్మి, నాగిరెడ్డి, తిక్కిశెట్టి సత్యనారాయణ, చవలం విద్యాసాగర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పెదబయలు తహశీల్దారు మృతికి సంతాపం

ప్రజాశక్తి-అడ్డతీగల : అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండల తహశీల్దారు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో స్థానిక మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద తహశీల్దారు చిక్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్వోలు, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జెన్‌కో చీఫ్ ఇంజినీర్‌గా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు చేపట్టిన నాగేశ్వరరావు

ప్రజాశక్తి -సీలేరు : ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్‌గా కెవి.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఇన్చార్జి సీఈగా కొనసాగిన కె.వెంకటేశ్వరరావు తన వ్యక్తిగత పనులపై విదేశాలు వెళ్లారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి చెందిన ఎస్ఈ నాగేశ్వరరావుకు సీలేరు కాంప్లెక్స్‌కు చీఫ్ ఇంజనీర్ బాధ్యతలు చేపట్టారు. చీఫ్ ఇంజనీర్‌కు కింది స్థాయి ఇంజనీర్లు, కార్మికులు అభినందనలు తెలిపారు.

## చంద్రమోహన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి జోన్ 4లో వార్డు సచివాలయం శానిటేషన్ సెక్రటరీగా పనిచేస్తున్న బాకూరి చంద్రమోహన్ పని ఒత్తిడిలో గుండెపోటుతో మరణించారని, ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్‌జిఒ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు కె.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా ఎన్‌జిఒ సంఘం కార్యాలయంలో గురువారం చంద్రమోహన్ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ అనారోగ్య కారణంతో పాటు చెత్త పన్నుల వసూలు కోసం సంబంధిత అధికారులు అదే పనిగా ఒత్తిడి చేయడంతో చంద్ర మోహన్ గుండెపోటుతో మరణించారని చెప్పారు.

ఆయన కుటుంబంలో అర్హత కలిగిన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగిగా చంద్రమోహన్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని ఆర్థిక ప్రయోజనాలను త్వరగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘం నాయకులు నారాయణరావు, సుబ్రహ్మణ్యం, సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు టివి.కుమార్ యాదవ్, పిజె.గణేష్ కుమార్, బివి.అశోక్ కుమార్ యాదవ్, శ్యామలరావు, హరీష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి

మాట్లాడుతున్న సురేష్

ప్రజాశక్తి-చింతూరు

జల్ జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఏడుగురాళ్లపల్లి గ్రామంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 లక్షల రూపాయలతో గత ఏడాది అక్టోబర్లో ప్రారంభించిన పనుతలు నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ట్యాంకులు, పైపులైన్లు మరమ్మతులు చేయమంటే జల్ జీవన్ మిషన్ ద్వారా నీరు అందిస్తామని చెప్పారని, ఈ పనులు సంవత్సరాల తరబడి సాగుతున్నాయని తెలిపారు. తక్షణమే పనులు పూర్తి చేసి ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లం సుబ్బమ్మ, సావలం కన్నయ్య, సత్తిబాబు, సవలం జయమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉక్కు'పై సుప్రీంలో సవాలు చేయాలి

దీక్షల్లో కూర్చున్న గృహ కార్మికులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేయాలని గృహ కార్మికుల సంఘం (సిఎఫ్‌టియుఐ) రాష్ట్ర కార్యదర్శి జి.బాలభాను డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 616వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో గృహ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన 26 వేల ఎకరాల భూమిని సేకరించి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కూడా స్టేట్ హోల్డర్‌గా ఉంటుందన్నారు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు.

ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత కూడా ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ రంగంలో ఈ కర్మాగారం ఉన్నందున ఎస్‌సి, ఎస్‌టి, బిసి వంటి అణగారిన తరగతుల వారికి ఉపాధి లభించిందన్నారు. ప్రైవేటీకరణ జరిగితే ఇటువంటి వారందరికీ ఉపాధి లేకుండా పోతుందన్నారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో పి.వెంకటలక్ష్మి, కె.ఎలమాజీ, లండా ఎర్రమ్మ, ఇ.లక్ష్మి, వై.సత్యవతి, ఎ.అంకమ్మ, కె.దేవి, దానమ్మ పాల్గొన్నారు.

## భక్త జనసందోహం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వన్ టౌన్ ప్రాంతం విశాఖ పురి మేరీ మాత భక్తులతోనూ, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులతోను పోటెత్తింది. బస్సులలోనూ, ఇతర వాహనాల్లోనూ, ప్రత్యామ్నాయ మార్గాలలోను వేలాది మంది భక్తులు గురువారం వన్‌టౌన్ ప్రాంతానికి తరలివచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. వందల సంఖ్యలో పోలీసులు మోహరించి ట్రాఫిక్ నియంత్రణకు తీవ్రస్థాయిలో శ్రమించారు.

విశాఖ పురి మేరీ మాత (కొండ గుడి) పండగ కావడంతో విశాఖపట్నం, ఉత్తరాంధ్ర జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. అదేవిధంగా మరొక పక్క శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి మూడో గురువారం మార్గశిర మాసోత్సవాలు కావడంతో ఉత్తరాంధ్రలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో భక్తులతో టౌన్ కొత్త రోడ్డు, బురుజుపేట, పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డు, రీడింగ్ రూం, కురుపాం మార్కెట్, పాత పోస్టాఫీసు, ఫెర్రీ రోడ్డు ప్రాంతాలు కిటకిటలాడాయి. దీన్ని ముందుగానే గుర్తించిన చిల్లర వ్యాపారాలు రకరకాల స్టాల్స్‌ను దాదాపు అన్ని మార్గాలలో ఏర్పాటు చేశారు. దీంతో ఏ రోడ్డు చూసినా కొనుగోలుదారులతో కిటకిటలాడింది. అటు కొండ గుడి నిర్వాహకులు, ఇటు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా పలు చర్యలు తీసుకున్నారు. శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల సౌకర్యార్థం మంచి నీళ్లు, ప్రసాదాలు, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేశాయి.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

## ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఓటర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు, గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బిఎల్వోలు, కార్యాలయ సిబ్బందితో సబ్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్వోలు ఇంటింటికి తిరిగి 18 ఏళ్లు నిండిన యువతి, యువకులను గుర్తించి వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డు లేకపోయినా సరే వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్‌తో ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. మృతి చెందిన వారి ఓట్లు ఉంటే వారిని తక్షణమే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు ఎ.సత్యనారాయణ, బిఎల్‌వోలు సిబ్బంది పాల్గొన్నారు.

## వరద నష్టపరిహారం చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కూనవరం : వరదలు వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వరద నష్టపరిహారం అందలేదని, తక్షణమే పరిహారం ఇవ్వాలని సిఐటియు నాయకులు బొజ్జ సుధారాణి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కొండ ఈశ్వర్లు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో సుధారాణి మాట్లాడుతూ వరదల సమయంలో వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రెండు నెలలలో అందరికీ పరిహారం అందిస్తామని ప్రకటించి నేటికి ఆరు నెలలు అవుతున్నా ఎటువంటి నష్టపరిహారం అందించలేదని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం చేతి వత్తిదారులకు అన్ని రంగాల కార్మికులకు వరద నష్ట పరిహారం ప్రతి ఇంటికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తాళ్లూరి శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఎడ్ల వెంకన్న, బాబు, వీరబాబు, భారతి, షణ్ముఖరావు, తాళ్లూరి నీలకంఠ నాగరాజు కొండా నాగమణి, తప్పట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రోడ్డు ప్రమాదాలు నివారణకు చర్యలు చేపట్టడం జరిగిందని రాజవొమ్మంగి సీఐ ఆర్ రవికుమార్ అన్నారు. మండలంలోని చెరుకుంపాలెం నుండి రాజవొమ్మంగి మీదుగా జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారణకు సింగంపల్లి నుండి, జడ్డంగి ప్రధాన రహదారి మధ్య ప్రమాదకర మలుపుల వద్ద గురువారం స్టాఫ్ బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ, వాహనదారులు ప్రమాదకర మలుపులు వద్ద జాగ్రత్తగా వెళ్లాలని, ఓవర్ స్పీడ్ ప్రమాదకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.